చిట్టి ఆంజనేయుని శతజయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీ చిట్టి ఆంజనేయ స్వామి మందిరం శత జయంతి ఉత్సవాలకు సన్నద్ధమవుతోంది. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జూన్ ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు వేడుకలను నిర్వహించనున్నారు.

తెనాలి, పరిసర ప్రాంతాల్లో పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పలు దేవాలయాలు ఉన్న విషయం తెలిసిందే. వీటిలో స్థానిక బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో గల శ్రీ చిట్టి ఆంజనేయ స్వామి మందిరం పట్టణంలోని ప్రముఖ ఆలయంగా విరాజిల్లుతోంది. 1924 జూన్ 5న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. స్వామి కేవలం అడుగున్నర ప్రమాణంలో 'చిట్టి' రూపంలో ఉన్నందున చిట్టి ఆంజనేయస్వామిగా పిలుస్తున్నారు. మహిమాన్వితుడైన స్వామిగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు.

స్వామివారి శత జయంతి సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ నిర్వహణ కమిటీ ఆలయ అర్చక స్వాముల ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు.

ఉత్సవాల తొలి రోజైన జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు విశేష నాగవల్లి సహస్ర నామార్చన, 11 గంటలకు ప్రసాద వినియోగం ఉంటాయని అర్చక


చిట్టి ఆంజనేయుని మూలవిరాట్టు

స్వామి దీవి యోగానంద చక్రవర్తి తెలియజేశారు. సాయంత్రం ఏడు గంటలకు శ్రీ లక్ష్మీ కూచిపూడి నృత్య కళాకేంద్రం నాట్యాచార్య ఏ.వెంకటలక్ష్మి శిష్య బృందంచే హనుమాన్ చాలీసా నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.

రికార్డు స్థాయిలో వందమంది నృత్య కళాకారులచే ఈ ప్రదర్శన ఉంటుందని కమిటీ సభ్యుడు విష్ణుభట్ల రత్నాకర శాస్త్రి చెప్పారు. రెండో రోజున


ఉత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ఉదయం 9 గంటలకు వైఖానస ఆగమ పండితుడు వేదాంతం వెంకట నాగమారుతిచే విశేష నక్షత్ర పూర్వక మన్యుసూక్త హోమం నిర్వహిస్తారు. 11.30 గంటలకు పూర్ణాహుతి, ప్రసాద వినియోగం ఉంటాయి. రాత్రి ఏడు గంటలకు 'మధుర వాగ్వసంత' తిరుమల తిరుపతి దేవస్థానముల వ్యాఖ్యాత దీవి హయగ్రీవాచార్యులుచే హనుమద్వైభవం ప్రవచనం ఉంటుందని తెలియజేశారు. చివరి రోజైన జూన్ మూడో తేదీన ఉదయం 10 గంటలకు సింధూర సహిత జంబీర ఫల సహస్రనామార్చన, అనంతరం ప్రసాద వినియోగ ఉంటుంది. రాత్రి ఏడు గంటలకు 'పౌరాణిక బ్రహ్మ' ప్రముఖ విద్వాంసుడు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణ మూర్తిచే 'సుందరకాండము' కథాగానం ఏర్పాటు చేశారు. భక్తులు శత జయంతి మహోత్సవాల్లో స్వామివారిని సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పోలేరమ్మ తల్లికి చద్ది నైవేద్యాలు



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వేమవరంలో కొలువైన శ్రీ పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి చద్ది నైవేద్యములు సమర్పించారు. జూన్ 1న ఘటం కుండ ఊరేగింపు(చద్ది వడ్డన), 2న అమ్మవారికి వేడి నైవేద్యములు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోనున్నట్లు తెలిపారు. ఇక్కడే పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు అమ్మవారి జాతర మహోత్సవానికి విచ్చేసి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు కోరారు.

క్లుప్తంగా

మహిళా స్వావలంబనే సేవాభారతి లక్ష్యం



తెనాలి: మహిళా స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెంపొందించటమే సేవాభారతి లక్ష్యమని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయవాది పద్మవల్లి అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని సేవా భారతి కార్యాలయం మధుకర నిలయంలో సోదరి నివేదిక కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సేవాభారతి, తెనాలి కార్యదర్శి వి.లక్ష్మీ నారాయణ పర్యవేక్షించారు. జిల్లా సంయోజక్ జాగు శ్రీనివాస్, ప్రాంత పర్యావరణ సంరక్షణ గతివిధి ప్రాంత సంయోజక్ పీవీ ఆదిశేషయ్య, టైలరింగ్ శిక్షకులు యార్లగడ్డ రోషిత, బ్యూటీషియన్ శిక్షకురాలు వి.విజయదుర్గ పాల్గొన్నారు. నగర కార్యవాహ త్రిపురమల్లు హనుమత్ ప్రసాద్ స్వాగతం పలికారు. పలువురు నగర ప్రముఖులు, అభ్యాసకులు పాల్గొన్నారు. తదుపరి రెండో బ్యాచ్ శిక్షణను జూన్ 20 నుంచి ఆరంభిస్తామని, శిక్షణార్థులు ఈలోగా తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441753817 నంబరును సంప్రదించాలని కోరారు.

పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు



తెనాలి: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 616 జయంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తన పోటీల్లో విజేతలకు ఆదివారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక గీతా మందిరంలో ఏర్పాటైన సమావేశానికి పాటిబండ్ల శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈదర వెంకట పూర్ణచంద్, పెనుగొండ వెంకటేశ్వరరావు, బచ్చు సాంబశివరావు, మాదల సత్య కుమారి, కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. జూనియర్ విభాగంలో తుల్య శ్రీ,, అందే తన్మయి, సంహిత, యశస్విని, సీనియర్ విభాగంలో దేవిశెట్టి వెంకట శ్రీలక్ష్మి, వాసంతి, మాజేటి వాసవి, నాగ మహేశ్వరరావు, మారా లలిత కుమారి, ఏ.రాజ్యలక్ష్మి బహుమతులు అందుకున్నారు. లక్కరాజు కనకదుర్గ సభా పరిచయం చేశారు. సంగీతం ఉపాధ్యాయిని ఎం.మాల్కోస్, వీణ డిప్లమా హోల్డర్ ఎం.చంద్రకోస్, డోలు వాద్యకారిణి షేక్ లలితా మనీషాను సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. కొండపి శ్రీనివాసరావు వసుంధర దంపతులు పర్యవేక్షించారు. సభ్యులు అందె బాల చంద్రమౌళి, కేశవరావు, గౌరావఝల ఆంజనేయ శాస్త్రి, బొంతల శాంతి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని జీఆర్పీ పోలీసులు ఆదివారం రాత్రి గుర్తించారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుంది. నిండు నీలం రంగు నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి సింధూరాభిషేకం, పుష్పాలంకరణ కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరాంజనేయుని ఆలయంలో కోలాట భజన



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సువర్చలా సహిత అంజనేయస్వామి వారి ఆలయ ఉత్సవాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కోలాట నృత్య భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ భజన కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు కోలాట భజన నిర్వహించారు. రవిచంద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. శ్రీ సీతారామ భజన సమాజం, అంజనేయ భక్త సమాజం, తిరుమల తిరుపతి దేవస్థానముల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాలు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. సూర్యాష్టకం, సూర్య నమస్కారం స్తోత్రాలు పఠించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సీఎం కాలనీలో కార్డన్ సెర్చ్


ముత్తెంశెట్టిపాలెంలో ప్రజలకు సూచనలు చేస్తున్న పోలీసులు


తెనాలి సీఎం కాలనీ వాసులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో గృహ సముదాయాలు అధికంగా ఉండటంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు నివసించే మారీసుపేట పరిధి సీఎం కాలనీలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, వన్ టౌన్ సీఐ జి. దశరథ రామారావు, టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్, రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావుతో పాటు దాదాపు 60 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రాజీవ్ గృహకల్ప నివాసాలతో పాటు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడ వద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైక్‌లలో హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 25 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక ట్రక్, ఆటోను సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని త్రీ టౌన్ సీఐ రమేష్ బాబు తెలియజేశారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీసుల సూచన

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అలజడులు సృష్టించినా కఠినంగా వ్యవహరిస్తామని వన్ టౌన్ ఎస్ఐలు కరిముల్లా, సుబ్బయ్య ప్రజలను హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వన్‌టౌన్ పోలీసులు ఆదివారం స్థానిక ముత్తెంశెట్టిపాలెం, ఇస్లాంపేటలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ వద్దని సూచించారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెనాలి రచయితలకు అన్నమయ్య పురస్కారాలు

తెనాలి: సంప్రదాయ కళల పరిరక్షణ సమితి, చిత్తూరు ఎఎస్ ఫౌండేషన్, తిరుపతి సంస్థల నిర్వహణలో ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లిలో జరిగిన సాహితీ వేడుకల్లో తెనాలి రచయితలు అన్నమయ్య పురస్కారాలను స్వీకరించారు. తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా సాహితీ రచనలు చేస్తూ తెలుగుభాషా వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అన్నమయ్య పురస్కారం అందజేసినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మడవలి చిరంజీవి, సంస్థ ప్రధాన కార్యదర్శి మడవలి తులసి, ఎ.ఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు అభీలాల శ్రీధర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన వివిధ రంగాల ప్రముఖ కళాకారులు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెంకట రఘునాధరావుకు స్థానిక శారదా ఎలిమెంటరీ పాఠశాలలో పనిచేస్తున్న మునిపల్లె వెంకట రఘునాధరావు కూడా ఇదే వేదికపై అన్నమయ్య పురస్కారాన్ని స్వీకరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో పాటు కళారంగానికి ఆయన చేస్తున్న సేవలకు ఈ గుర్తింపును అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.


ఆళ్ల నాగేశ్వరరావుకు అన్నమయ్య పురస్కారం

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ ఎస్.భవనం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డీ–3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద నేతృత్వంలో ప్రతి నెలా చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి జరిగిన ఈ వైద్య శిబిరంలో షుగర్ వ్యాధితో పాటు గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలు అందించారు. డాక్టర్ డి శారద రోగులను పరీక్షించి వైద్య పరీక్షలు చేశారు. పరిసర ప్రాంతాల్నుంచి పెద్ద సంఖ్యలో రోగులు హాజరయ్యారు. వైద్య పరీక్షల అనంతరం షుగరు, బీపీ, కాల్షియం, బలానికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో 50 మంది వలంటీర్లు సహకారం అందించారు. సొసైటీ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి జాబిల్లి సేవా సంఘం ఆర్థిక చేయూత

తెనాలిఅర్బన్: విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు జాబిల్లి సేవా సంఘం ముందుకు రావడం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జాబిల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున కొత్తపేటలోని దీప్తి పబ్లికేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కోసరాజు వెంకట్రావు, అధ్యక్షులు ఆంజనేయులు, విశ్రాంత అధ్యాపకులు శైలజ, రాజేశ్వరి, రమాదేవి, పూర్ణచంద్రరావు, అమిరినేని శివరామప్రసాద్, సీఆర్‌పీఐ శ్రీదేవి, వేజళ్ల నవ్య, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.


నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలి కవులకు స్వర్ణకంకణ సత్కారం

తెనాలి: ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన 134వ అంతర్జాతీయ సీస పద్య కవి సమ్మేళనంలో తెనాలికి చెందిన ముగ్గురు కవులు/రచయితలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో స్వర్ణకంకణ సత్కారం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన సీసీ పద్య వైభవం సంకలనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల పద్య కవుల నుంచి మూడేసి సీస పద్యాలను ఆహ్వానించారు. ఆయా పద్యాలతో తీసుకొచ్చిన సంకలనం ఆవిష్కరణను ఆదివారం ఏలూరులోని వైఎంహెచ్ఏ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. సంకలనానికి డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి కవి ధర్మం అనే శీర్షికన తన పద్యాలను పంపారు. ఇదే వేదికపై తెనాలికి చెందిన పౌరాణిక నటుడు, పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి, రంగస్థల నటుడు, పద్యకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. సీస పద్య వైభవానికి పద్యాలను పంపిన వీరిని కూడా నిర్వాహకులు సత్కరించి స్వర్ణకంకణ సత్కారం చేశారు. మొత్తం 175 మంది కవులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. కావ్యావిష్కరణ సభలో అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త శ్రీమతి కొల్లి రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి చిట్టి లలిత, జాతీయ కార్యదర్శి డాక్టర్ టి. పార్థసారథి, వేద పండితులు డా.కావూరు శ్రీనివాస శర్మ, ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ హరికోటి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.


డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ: తాడికొండలోని శ్రీ సత్యసాయి స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి, ఎన్ఆర్ఐ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 92 మందికి పరీక్షలు చేసి, వీరిలో 31 మందిని శుక్లాల ఆపరేషన్ నిమిత్తం గుర్తించారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా నిర్వాహకులు బండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ధనేకుల హరిబాబు, కాశింశెట్టి పున్నారావు, పాఠశాల ఇన్‌చార్జి రాయపూడి అనీల్, నీరుకొండ పెద్దబ్బాయి ఎన్ఆర్ఐ వైద్యులు ఎం.కీర్తన పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులు

అనుమానాస్పద వ్యక్తుల సమాచారమివ్వండి


లాడ్జీ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్, సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: లాడ్జీలకు వచ్చే వారు అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని లాడ్జీ నిర్వాహకులకు డీఎస్పీ ఎం.రమేష్ సూచించారు. తెనాలి త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో లాడ్జీ నిర్వాహకులతో పోలీసులు సమావేశమయ్యారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంలో బయటి నుంచి అసాంఘిక శక్తులు వచ్చి లాడ్జీల్లో ఉండే అవకాశముందని వారి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని చెప్పారు. లాడ్జీలకు వచ్చే వారి నుంచి సరైన గుర్తింపు కార్డు తీసుకుని పూర్తి వివరాలు నమోదు చేసిన అనంతరమే గదులు కేటాయించాలన్నారు. గదులు అద్దెకు తీసుకున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు అందించాలని చెప్పారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సీఐ ఎస్.రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

వృత్తిపరమైన నైపుణ్యంతో సేవలందించాలి



మంగళగిరి: వృత్తి పరమైన నైపుణ్యాన్ని పెంచుకుని రాష్ట్ర కో–ఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్) అభివృద్ధికి కృషి చేయాలని ఆప్కాబ్ ఎండీ ఆర్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన ఆప్కాబ్ ఉద్యోగుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిసాయి. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి హాజరైన ఉద్యోగులకు ఎండీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం వీసీ మనోజ్ కుమార్ అరోరా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్, పారీ స్కూలు డీన్ డాక్టర్ భరద్వాజ, శైలజ కొసరాజు పాల్గొన్నారు.

చారిత్రక అంశాలపై అవగాహన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా చారిత్రిక కథలు, నీతి కథలు వంటి పలు అంశాలపై ఉపాధ్యాయుడు అనిల్ అవగాహన కల్పించారు. చారిత్రిక అంశాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు వంటివి తెలుసుకోవచ్చని చెప్పారు. నీతి కథలు వినడం , చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత భావాలు కలిగి ఆదర్శవంతంగా సమాజంలో జీవిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.



రేపు సామూహిక చండీయాగం

మంగళగిరి: పట్టణంలో పాత మంగళగిరి జాతీయ రహదారిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయంలో ఈ నెల 28న మంగళవారం సామూహిక చండీయాగం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. చండీయాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

రేపు సామూహిక చండీ హోమం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని దుర్గానగర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో 28న సామూహిక చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైశాఖ పంచమి మంగళవారం ఉదయం 7 గంటలకు సామూహిక చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.



మద్యం షాపులకు నోటీసులు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని మద్యం షాపుల నిర్వాహకులకు ఆదివారం తాడేపల్లి ఎస్ఐ రమేష్ నోటీసు అందజేశారు. డీఎస్పీ సీహెచ్ రవికాంత్ ఆదేశాల మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు సూచనల మేరకు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని మద్యం షాపులకు నోటీసులు అందజేశామని ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, మద్యం దుకాణాల్లో అమ్మకాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, అలాగే సమయపాలన తప్పనిసరిగా పాటించాలని వైన్ షాపుల్లో పరిమితికి మించి మద్యం అమ్మకాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా అధిక మొత్తంలో ఒకే వ్యక్తికి మద్యం అమ్మినట్లు తెలిస్తే మద్యం కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు వైన్‌షాపు యజమాని, అమ్మిన సిబ్బందిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.